

ది ఎపిక్ న్యూ స్విఫ్ట్ ఆల్ న్యూ జెడ్ సిరీస్ కారును కస్టమర్స్‌కు అందజేస్తున్న వరుణ్ మోటార్స్ ప్రతినిధులు

వరుణ్ మోటార్స్ నుంచి..

ది ఎపిక్ న్యూ స్విఫ్ట్ కారు డెలివరీ

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): భారతదేశపు ప్రముఖ కార్ల కంపెనీ నుంచి విడుదలైన 175వ కార్ 'ది ఎపిక్ న్యూ స్విఫ్ట్' ఆల్ న్యూ జెడ్ సిరీస్ ఇంజన్‌తో తయారైన 50వ కారును వరుణ్ మోటార్స్ బాలానగర్ మారుతి డ్రైవింగ్ స్కూల్‌లో కస్టమర్‌కు అందజేశారు. కార్యక్రమంలో వరుణ్ మోటార్స్ ప్రతినిధులు కౌశిక్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్‌సీ రాజు, వరుణ్ మోటార్స్ జనరల్ మేనేజర్ కృష్ణ కుమార్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు 50 వాహనాలు డెలివరీ అయినట్లు వరుణ్ మోటార్స్ ప్రతినిధులు తెలిపారు.



శిక్షణ కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తదితరులు

నిమ్స్‌లో డయాలసిస్‌పై శిక్షణ శిబిరం

సనత్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హీమో డయాలసిస్ రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్వాలిటీ, డయాలసిస్ రోగుల్లో పోషకాలు తదితర అంశాలపై నిమ్స్ నెఫ్రాలజీ ఉద్యోగులు, డయాలసిస్ టెక్నీషియన్ల కోసం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిమ్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ నెఫ్రాలజీ, ఏఆర్‌ఎస్‌ఆర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిమ్స్ ట్రామా ఆడిటోరియంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ప్రారంభించారు. ఈ శిక్షణలో హీమోడయాలసిస్ చేసే విధానం, వివిధ దశలు, ఇన్ఫెక్షన్ కంట్రోల్, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాణాలు, అంటు వ్యాధులున్నవారికి డయాలసిస్, డయాలసిస్‌లో నాణ్యత, హైపర్ టెన్షన్ పేషెంట్లకు డయాలసిస్, రీనల్ ఫంక్షన్ టెస్ట్ ప్రాముఖ్యత, రోగులకు వచ్చే సాధారణ సమస్యలు, రికార్డుల నిర్వహణ, క్లెయిమ్‌లు, ఆర్‌ఓవాటర్ ట్రీట్‌మెంట్, ఏవీఫ్ కేనులేషన్, ఎమర్జెన్సీ డయాలసిస్ తదితర అంశాలపై నిపుణులు శిక్షణ ఇచ్చారు.

ఆకట్టుకున్న భవ్య హరి సంగీత కచేరి..



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న భవ్య హరి

పంజాగుట్ట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఆనంద్‌నగర్ కాలనీ విజ్ఞాన సమితి, సంగీత క్షీరసాగరం, సప్తపర్ణిల సంయుక్త ఆధ్వర్యంలో ఆనంద్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో చెన్నైకి చెందిన భవ్య హరి సంగీత కచేరీ జరిగింది. శ్రావ్యమైన కంఠంతో జనకజా సమేత అనే త్యాగరాజ కీర్తనతో వారి కచేరీ ప్రారంభించి కాంబోజి రాగంలో రామదాసు కృతితోను షణ్ముఖ ప్రియరాగంలో రాగం తానం పల్లవి ఆలపించి అందరినీ మంత్రముగ్ధుల్ని చేశారు. సరస్వతుల పార్థివ వయొలిన్‌తో, పి.మెహర్ సాగర్ మృదంగం తోను సహకరించారు. ఆనంద్ నగర్ కాలనీ, పద్మావతి నగర్ కాలనీ, వెంకటరమణ కాలనీ, నవీన్‌నగర్, తదితర ప్రాంతాలకు చెందిన సంగీత ప్రియులు, స్థానికులు పాల్గొన్నారు.

జనరంజకంగా రవీనా, రిషిత నాట్య ప్రదర్శన



నాట్యం చేస్తున్న నర్తకులు

రవీంద్రభారతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): లయబద్ధమైన నాట్యాంశాలకు వైవిధ్యభరితంగా నర్తించిన కవల కళాకారులు పావులూరి రవీనా, రిషిత ఆహూతులను రంజింపజేశారు. చక్కటి అభినయం, ఆకట్టుకునే హావభావాలతో ఇరువురు కళాకారులు జనరంజకంగా ప్రదర్శించారు. ఆదివారం తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో ప్రముఖ నాట్య గురువు పసుమర్తి రామలింగ శాస్త్రి శిష్యురాళ్లయిన రవీన, రిషిత భరతనాట్యంలో అరంగేట్రం చేశారు. పుష్పాంజలి, గణేష పంచరత్నం, జతిస్వరం, శబ్దం, పాదవర్ణం, కీర్తనం, తిల్లాన, మంగళం తదితర అంశాల్లో నర్తించి భళా అనిపించారు. చక్కటి ఆహార్యం, ఆకట్టుకునే హావభావాలతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారగ్రహీత మంజుల రామస్వామి, సీనియర్ పాత్రికేయులు వల్లీశ్వర్, మానస మూర్తి, అప్పారావు కళాకారులను సత్కరించి అభినందించారు. శాస్త్రీయ కళల్లో చిన్నారులను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం నర్తకుల కుటుంబ సభ్యులు కృష్ణ చైతన్య, అమృత వర్షిణితో పాటు పలువురు సమక్షంలో పసుమర్తి రామలింగశాస్త్రికి గురుసత్కారం చేశారు.

ఇంటర్నేషనల్ మెజరర్స్ క్లినిక్ విజయవంతంగా పూర్తి



కార్యక్రమంలో ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ ప్రతినిధులతో చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డియజ్

అల్వాల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ భారతదేశంలో మొదటిసారిగా సెయిలింగ్‌కు సంబంధించి సెయిలర్స్ పోటీల్లో ఎంత దూరం ప్రయాణించాలి అనే అంశంపై ఇంటర్నేషనల్ మెజరర్స్ క్లినిక్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఎంసీఈఎంఈ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ నీరజ్‌వర్షనే తెలిపారు. ఆదివారం ఇంటర్నేషనల్ మెజరర్స్ క్లినిక్ కార్యక్రమంలో ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. త్వరలో హుస్సేన్‌సాగర్ నిర్వహిస్తున్న అంతర్జాతీయ సెమినార్ పోటీలకు సంబంధించి రెండు రోజులుగా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డియాజ్ మార్గదర్శకత్వంలో అంతర్జాతీయ ప్రతినిధి ఇవాన్‌తో సహా 18మంది ఇంటర్నేషనల్ మెజరర్స్ క్లినిక్‌లో పాల్గొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సెయిలర్స్ ఎన్నిరౌండ్లు, పొడువు, అడ్డం ఎంత దూరం సెయిలింగ్ చేయాలనే అంశంపై కొలతను వెల్లడించారు.



ఆర్థికసహాయం చెక్కులందుకున్న పేద విద్యార్థులతో తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్, ట్రస్టు నిర్వాహకుడు శివారెడ్డి

పేద విద్యార్థుల చదువుకు కోటి ఆర్థిక సాయం

ఖైరతాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్య వైద్యంలో పేదలకు అండగా నిలుస్తున్న ఎంఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు సేవలను తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశంసించారు. ఆదివారం లక్డీకాపూల్‌లో జరిగిన కార్యక్రమంలో 300 మంది పేద విద్యార్థులకు ట్రస్టు ద్వారా రూ.10వేల ఆర్థిక సహాయం, మరికొంత మందికి వైద్యసహాయం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం కోటి రూపాయల వరకు ఆర్థిక సహాయం చేశామని నిర్వాహకులు తెలిపారు. దీనికి ప్రసాద్‌కుమార్ అతిథిగా హాజరై పేదలకు చెక్కులను అందజేశారు. ట్రస్టు నిర్వాహకులు శివారెడ్డి మాట్లాడుతూ పేదలకు సహాయం అందించేందుకే ఎంఎస్‌ఆర్ ట్రస్టును స్థాపించామని, అవసరంలో ఉన్న పేదల వైద్యం కోసం తమ ట్రస్టు సహాయం చేస్తుందన్నారు. ఇందులో ట్రస్టు ప్రతినిధి శిరీషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ సంతలో బక్రీద్ సందడి

పెద్దఎత్తున పొట్టేళ్ల, మేకపోతుల విక్రయాలు



సనత్‌నగర్ సండే మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన జీవాలు

సనత్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పేదల మార్కెట్‌గా, ఎర్రగడ్డ సంతగా పేరుగాంచిన సనత్‌నగర్ సండే మార్కెట్‌లో ఈ ఆదివారం బక్రీద్ సందడిగా మారింది. మార్కెట్‌లో పెద్ద ఎత్తున జీవాలను విక్రయించారు. బక్రీద్ సందర్భంగా ఎర్రగడ్డ సండే మార్కెట్‌లో దూరప్రాంతాల నుంచి విక్రయదారులు మేకలు, పొట్టేళ్లను తీసుకొచ్చారు. సంతలో కొంత ప్రాంతమంతా జీవాలతో నిండిపోయింది. ఈ జీవాలను కొనుగోలు చేసేందుకు తెల్లవారుజాము నుంచే కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. మార్కెట్‌లో ఉన్న జీవాలను ముస్లింలు పోటీపడి కొనుగోలు చేశారు. కొనుగోలుదారులు, విక్రయదారులతో సంత సందడిగా మారింది. నగరంలో పొట్టేళ్లకు మంచి గిరాకీ ఉండటంతో తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చారు. టెంపోలు, డీసీఎం, లారీల్లో మేకలను, గొర్రెలను, పొట్టేళ్లను తీసుకొచ్చారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, జహీరాబాద్, తండూరు, వికారాబాద్‌తోపాటు నల్గొండ, మహబూబ్‌నగర్ నుంచి కూడా వ్యాపారులు తమ జీవాలను తెచ్చి విక్రయించారు. బలంగా ఉండే మేక పోతులను వివిధ ప్రాంతాల నుంచి తెచ్చి, అధిక ధరలకు విక్రయించారు.

త్యాగానికి ప్రతీక..

త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ. ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు బలమైన పొట్టేళ్లు, మేకపోతులను కొనుగోలు చేస్తారు. జంతువు మాంసాన్ని మూడు భాగాలుగా చేస్తారు. ఒక భాగం పేదలకు, మరోభాగం స్నేహితులకు, బంధువులకు ఇవ్వగా మిగతాభాగాన్ని కుటుంబ సభ్యులు వినియోగించుకుంటారు. బక్రీద్ రోజు కొత్త దుస్తులు ధరించి, ఈద్గాహ్ వద్ద ఈద్ అల్ అదా ప్రార్థనల్లో పాల్గొంటారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటారు.

రక్తదాన ఆవశ్యకతను తెలిపిన రన్

- అపోలో ఆస్పత్రి, టీసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహణ



రన్‌ను ప్రారంభిస్తున్న తేజస్వీరావు తదితరులు

హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని అపోలో ఆస్పత్రి, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)తో కలిసి 'వాక్ డొనేట్ రిపీట్' అనే లక్ష్యంతో మూడు కిలోమీటర్ల రన్‌ను జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి వద్ద ఆదివారం నిర్వహించారు. రక్తదానం ప్రాముఖ్యత, అవగాహన పెంపొందించడమే ముఖ్య ఉద్దేశంగా ఈ వాక్‌ను నిర్వహించామని ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. దాదాపు 1500 మంది టీసీఎస్ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానంపై తమకున్న నిబద్ధతను చాటారు. ఈ సందర్భంగా అపోలో ఆస్పత్రులు(తెలంగాణ రీజియన్) సీఈఓ తేజస్వీరావు, డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్(తెలంగాణ రీజియన్) డాక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ రక్తదానం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని తాము చేపట్టిన ఈ వాక్‌కు టీసీఎస్ సహకారం అందించడం హర్షణీయమన్నారు. అనంతరం టీసీఎస్ రీజినల్ హెడ్ చల్ల నాగ్, హెడ్ ఆఫ్ టీసీఎస్ హైదరాబాద్ హెచ్‌ఆర్ శ్రీకాంత్ సూరంపూడి మాట్లాడుతూ అపోలో సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. రక్తదానం వల్ల ఒక యూనిట్ బ్లడ్ ముగ్గురి జీవితాల్లో వెలుగులను నింపుతుందని డాక్టర్ సుధారంగనాథన్ అన్నారు.

ఉత్సవ కమిటీ పేరులో ఎలాంటి మార్పూ లేదు

- ఖైరతాబాద్‌లో 70 అడుగుల వినాయకుడు



గణపతి ప్రాంగణంలో జరిగిన బస్తీవాసుల సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

ఖైరతాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ పేరును మార్చామని వచ్చిన ప్రకటనల్లో ఎలాంటి వాస్తవమూ లేదని, ఎప్పటిమాదిరిగానే అదే పేరుతో ఉత్సవాలను నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం గణపతి ప్రాంగణంలో ఖైరతాబాద్ వాసులతో ఏర్పాటైన సమావేశంలో ఏకగ్రీవంగా ఈ నిర్ణయాన్ని తీర్మానించినట్లు కార్యనిర్వాహక కార్యదర్శి సింగరి రాజ్‌కుమార్, కన్వీనర్ సందీప్‌రాజ్ తెలిపారు. ఉత్సవకమిటీ ప్రతినిధుల్లో కొందరు పొరపాటున కొత్తపేరుతో కమిటీని ఏర్పాటు చేశామని, దాని ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుపుతామని పేర్కొన్న నేపథ్యంలో అందరి సలహాలు, సూచనలు తీసుకునేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. 69 సంవత్సరాలుగా జరుపుతున్న ఉత్సవాల్లో భాగంగా 70వ సంవత్సరం 70 అడుగుల భారీ గణపతిని తయారుచేసి వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు గణపతి విగ్రహ పనులను కర్రపూజతో ప్రారంభించనున్నామని, దీనికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ విజయారెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు భగవంత్‌రావు, ఉపాధ్యక్షులు శశిధర్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ప్రతినిధులు మాజీ కార్పొరేటర్ కృష్ణయాదవ్, డి.లక్ష్మణ్ యాదవ్, రాముయాదవ్, బాల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న బైక్ రేసింగ్స్

- పలువురిపై కేసు.. బైక్‌లు సీజ్
- తీరు మార్చుకోని బైక్ రేసర్లు



ఐటీ కారిడార్‌లో బైక్‌రేసింగ్ దృశ్యం

రాయదుర్గం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లో ఆకతాయిలు నిర్వహించే బైక్ స్టంట్స్, కట్స్, బైక్‌రైడ్‌లతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శని, ఆదివారాలు వచ్చాయంటే రాయదుర్గం ఐటీ కారిడార్‌లోని టీహబ్ పరిసర ప్రాంత రహదారులపై బైక్‌రైడర్లు గుంపులుగుంపులుగా వచ్చి ప్రజలు తిరుగుతున్న సమయంలోనే బైక్‌స్టంట్స్, రేసింగ్‌లు చేస్తూ హడలెత్తిస్తున్నారు. 15 రోజుల క్రితం రాయదుర్గం పోలీసులు రాత్రి సమయంలో బైక్‌రేసింగ్ చేస్తున్న సుమారు 50 మందిని అదుపులోకి తీసుకున్నారు. బైక్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ ఆకతాయిలు డోంట్‌కేర్ అంటూ మళ్లీ బైక్ రేస్‌లు, స్టంట్‌లు చేస్తూ రోడ్డుపై వెళ్తున్న ప్రజలను హడలెత్తిస్తున్నారు. శనివారం రాత్రి రోడ్డు సందడిగా ఉన్న సమయంలోనే రెచ్చిపోయారు. బైక్ టైర్లపై పెట్రోల్‌పోసి మంటలు అంటిస్తూ రేసింగ్‌లు నిర్వహించారు. దీంతో ఒక్కసారిగా ప్రజలు భయంతో పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరుగురు బైక్‌రైడర్స్‌ను అదుపులోకి తీసుకున్నారు. బైక్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. అలాగే, బంజారాహిల్స్ తాజ్ హోటల్ వద్ద బైక్‌పై వెళ్తున్న సీనియర్ జర్నలిస్టును అతివేగంతో దూసుకెళ్లిన గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో కాలు విరిగింది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బైక్‌రేస్‌లు, స్టంట్స్ చేసే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మాదాపూర్ రోడ్లపై డ్రైనేజీ నీరు

- ఏడాదంతా మురుగు ప్రవాహం
- పట్టించుకోని అధికారులు



100 ఫీట్ రోడ్ పొడవునా ప్రవహిస్తున్న డ్రైనేజీ

మోతీనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విశ్వనగరంగా అన్ని రంగాల్లో దూసుకుపోతున్న హైదరాబాద్ పారిశుధ్య విషయానికి వచ్చేసరికి అంతే స్థాయిలో వెనకబడిపోతోంది. నగరంలో ప్రధానమైన మాదాపూర్‌లోనే ఈ పరిస్థితి నెలకొని ఉంది. మాదాపూర్ ప్రాంతంలోని ప్రధాన రోడ్లపై మురికినీరు ఏడాది పొడవునా జీవనదిలా ప్రవహిస్తోంది.

100 ఫీట్‌రోడ్, చందానాయక్ తండా, అయ్యప్ప సొసైటీ ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపై ఎక్కడ చూసినా డ్రైనేజీనీరు ప్రవహిస్తోంది. ఇదేదో ఒక నెల రెండు నెలల నుంచి ఉన్న సమస్య కాదు. ఏకంగా ఏడాదికి పైగా ఇదే పరిస్థితి ఉంటుంది. ముఖ్యంగా 100 ఫీట్ రోడ్ పొడవునా డ్రైనేజ్ నీరు పొంగి, విపరీతమైన దుర్గంధంతో మురికినీరు రెండు కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. అత్యంత రద్దీగా ఉండే 100 ఫీట్‌రోడ్ ప్రాంతంలో రోడ్డు దెబ్బతిని పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అయ్యప్ప సొసైటీలో ఇదే పరిస్థితి. మురికినీరు రోడ్లపై నిల్వ ఉండడం వల్ల దోమల సమస్య ఎక్కువై ఆ ప్రాంత ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. చందానాయక్ తండాలో అయితే పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఈ ప్రాంతంలోని ప్రధానరోడ్డు 365 రోజులూ మురుగునీటితో నిండి వర్షాకాలంలో పరిస్థితిలా తయారయింది. ఈ ప్రాంతాలన్నీ నిత్యం వాహనాల రాకపోకలతో అత్యంత రద్దీగా ఉంటాయి. మురుగునీరు పెద్ద ఎత్తున రోడ్లపై చేరడం వల్ల బురద పేరుకుపోతుంది. దీంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏడాదికి పైగా ఈ ప్రాంతాల్లో పారిశుధ్య లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అనేకసార్లు ఫిర్యాదు చేశాం

100 ఫీట్ రోడ్‌లో రెండు సంవత్సరాల నుంచి నిత్యం డ్రైనేజ్ ప్రవహిస్తోంది. విపరీతమైన దుర్గంధం, దోమల సమస్యతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. మా సమస్యను పరిష్కరించాలి.

\- ఎండీ రహీం, 100 ఫీట్ రోడ్డు నివాసి

సదుపాయాలు సమకూర్చడం లేదు

చందానాయక్ తండాలో ప్రధానరోడ్డులో ఎప్పుడు చూసినా మురుగునీరు నిల్వ ఉంటుంది. ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా గాలికి వదిలేశారు. దీంతో ప్రధానరోడ్డు మురుగునీటితో నిండి ఉంటుంది. ఈ విషయాన్ని అనేకసార్లు ఫిర్యాదు చేశాం. ఆ విషయాన్ని పట్టించుకోరు. పన్నులు మాత్రం ముక్కు పిండి వసూలు చేస్తారు.

\- భాస్కర్ నాయక్, తండా వాసి

ప్రశాంతంగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు



సైఫాబాద్ పీజీ కళాశాలలో సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షను తనిఖీ చేస్తున్న పాఠశాల విద్యాశాఖ సంచాలకులు దేవసేన

ఖైరతాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సైఫాబాద్ పీజీ సైన్స్ కళాశాలలో జరిగిన పరీక్షలో 124 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 77 మంది హాజరయ్యారని, 47 మంది హాజరు కాలేదని ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. ఒక నిమిషం నిబంధన మేరకు 9 గంటల అనంతరం వచ్చిన ఇద్దరిని పరీక్షకు అనుమతించలేదన్నారు. కాగా ఈ సెంటర్‌ను పాఠశాల విద్యాశాఖ సంచాలకురాలు దేవసేన సందర్శించి పరీక్ష జరుగుతున్న విధానాన్ని తనిఖీ చేశారు.



రన్ ఫర్ గ్రీన్‌ను ప్రారంభిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు చైర్మన్ ఉమర్ అలీషా

పర్యావరణ పరిరక్షణపై అవగాహన రన్

ఖైరతాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టి పరిరక్షించాలని, నగరాన్ని కాలుష్యం నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ ఉమర్ అలీషా పేర్కొన్నారు. ఆదివారం సంజీవయ్యపార్కు నుంచి జలవిహార్ వరకు ట్రస్టు ఆధ్వర్యంలో రన్ ఫర్ గ్రీన్ జరిగింది. దీనిని ఉమర్ అలీషా జెండా ఊపి ప్రారంభించారు. దూరదృష్టితో ఆలోచించగలిగే శక్తి విజయానికి పునాది అనే నినాదంతో రాబోయే రోజుల్లో కృత్రిమ ఆక్సిజన్‌లే శరణ్యమని చిన్నారులు ఆక్సిజన్ సిలిండర్లతో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది.



పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకి పూలబొకే ఇస్తున్న దళిత నాయకులు

అంబేడ్కర్ భావజాల ప్రచారానికి కృషి చేయాలి

బోరబండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల భావజాలనికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసేలా చూడాలని అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసుమొల్ల యాదగిరి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీని కోరారు. ఆదివారం సంఘం నాయకులతో కలసి ఆయన మర్యాదపూర్వకంగా ఎంపీని కలసి అభినందనలు తెలిపారు. ఎంపీని కలసిన వారిలో దశరథం, మోహన్ తదితరులు ఉన్నారు.



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతంను కలిసిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు కాటూరి రమేష్ తదితరులు

దళితుల ఆర్థిక అభివృద్ధికి చేయూత ఇవ్వండి

బంజారాహిల్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దళితుల ఆర్థిక అభివృద్ధికి చేయూతనందించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు కాటూరి రమేష్ అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నాగరి ప్రీతంను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాటూరి రమేష్ మాట్లాడుతూ ఖైరతాబాద్ నియోజకవర్గంలో దళితుల సంఖ్య ఎక్కువగా ఉందని వారందరికీ కార్పొరేషన్ ద్వారా ఉపాధి అవకాశాలకు మెరుగు పర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో దయ్యాలదాసు, సామగళ్ల నరేష్, భవానీ రమేష్, నర్రా ప్రవీణ్, బెంజిమిన్ తదితరులు పాల్గొన్నారు.

నిద్ర లేచేసరికి బ్యాగ్‌లో ల్యాప్‌టాప్ మాయం

యూసుఫ్‌గూడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నిద్రపోయి లేచే సరికి తన బ్యాగులో ల్యాప్‌టాప్ కనిపించలేదని ఓ యువతి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అనంతపూర్ జిల్లా గూటీ మండలం లచ్చనపల్లి గ్రామానికి చెందిన సుగురు హేమలత అమీర్‌పేటలో కోర్సులు నేర్చుకుంటూ మధురానగర్‌లోని శివసాయి లేడీస్ హాస్టల్‌లో నివాసం ఉంటోంది. ఈ నెల 13వతేదీ రాత్రి 11గంటల సమయంలో తన ల్యాప్‌టాప్‌ను తన బ్యాగులో పెట్టి నిద్రపోయింది. మరుసటి రోజు ఉదయం 9గంటలకు నిద్రలేచి తన బ్యాగు చూడగా తన ల్యాప్‌టాప్ కనిపించలేదు. తన రూమ్‌లో దివ్య, ప్రసన్న, తేజస్వీ అనే వారు ఉంటున్నారని, తన ల్యాప్‌టాప్ రూ.54వేల విలువైందని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫంక్షన్‌కు వచ్చిన వ్యక్తి అదృశ్యం



సురేష్ సాగర్(ఫైల్)

ఖైరతాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చి అదృశ్యమయ్యాడు ఓ వ్యక్తి. ఖైరతాబాద్ ఎస్ఐ అమర్‌నాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ మండలం షాపూర్‌కు చెందిన మెక్కొండ సురేష్‌సాగర్ (55) ఈనెల 13న ఖైరతాబాద్ మహాభారత్‌నగర్‌లో నివాసముండే తన అన్న కొడుకు వివాహ నిశ్చితార్థం కోసం వచ్చాడు. అదేరోజు మధ్యాహ్నం విందు పూర్తవగా సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరాడు. కానీ సురేష్‌సాగర్ ఇంటికి వెళ్లలేదు. అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో గానీ, 8712661531, 9912820552లలో గాని సంప్రదించవచ్చునని ఎస్ఐ అమర్‌నాథ్ తెలిపారు.

రగ్బీ టోర్నమెంట్‌లో నగర జట్టు విజేతలు

అడ్డగుట్ట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జింఖాన మైదానంలో ఈనెల 13 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన రగ్బీ టోర్నమెంట్‌లో హైద్రాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. హైద్రాబాద్ రబ్బీ అసోసియోషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల, మహిళల విభాగంలో జరిగిన టోర్నమెంట్ పోటీలో పురుషుల విభాగం హైద్రాబాద్ రగ్బీ జట్టు గెలిపిచిందని జిల్లా జట్టు కెప్టెన్ రతీష్ తెలిపారు. గత నాలుగేళ్లుగా ఉస్మానియా యూనివర్శిటీ మైదానం కోచ్ శ్రీకాంత్ నాయక్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకోవడం జరిగిందని రతీష్ తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగిన రగ్బీ పోటీలో హైద్రాబాద్ జట్టు పాల్గొవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర టోర్నమెంట్‌కు సహాయ సహకారాలు అందించిన ప్రవీణ్ కుమార్ రగ్బీ పుట్‌బాట్ క్లబ్ సభ్యులతోపాటు కోచ్ శ్రీకాంత్‌కు జట్టు సభ్యులు అభినందనలు తెలిపారు.



కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పీసీసీ పగ్గాలు అప్పగించాలి

బౌద్ధనగర్, జూన్16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ టీపీసీసీ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పీసీసీ పగ్గాలు అప్పగించాలని తెలంగాణ కాంగ్రెస్ కమిటీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి స్పందకర్ ప్రకాశ్ కోరారు. మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పీసీసీ పదవి రావాలని కోరుతూ ఆదివారం బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయంలో నాయకులు హరీష్, శివసాయి, సూర్యశశాంక్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చురుకైన నాయకుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అని, పీసీసీ పగ్గాలు అప్పగిస్తే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతీసుకుని మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పీసీసీ పగ్గాలు అప్పగించేలా చర్యలుతీసుకోవాలని కోరారు.

అత్తా కోడళ్ల గొడవ - అత్త అదృశ్యం



చంద్ర అనురాధ

బోయినపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అత్తాకోడళ్ల మధ్య గొడవతో అత్త అదృశ్యమైన సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాపూజీనగర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రశ్రీకాంత్ డ్రైవర్‌గా పనిచేసుకుంటూ భార్య శిరీష, తల్లి చంద్రఅనురాధలతో కలిసి బోయినపల్లి బాపూజీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. భార్య శిరీష 8 నెలల గర్భవతి. ఈ క్రమంలో గత కొంతకాలంగా అత్త చంద్రఅనురాధ, కోడలు శిరీషల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రెండురోజుల క్రితం అత్తాకోడళ్ల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో గర్భవతి అయిన శిరీష అస్వస్థతకు గురికావడం జరిగింది. దీంతో ఏమి జరిగిందో కానీ అత్త చంద్రఅనురాధ శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిపోయి ఆదివారం వరకు తిరిగి రాలేదు. తెలిసినవారిని, బంధువులను ఆరాతీసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో అనుమానం వచ్చిన కుమారుడు శ్రీకాంత్ ఆదివారం బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

బోయినపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓల్డ్ బోయినపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ బోయినపల్లి వల్లభ్‌నగర్‌లో నివాసం ఉంటున్న సేవ్య(45) రోజువారీ కూలీపని చేస్తుంటాడు. ఇతనికి ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు సంతానం. అందరికీ పెళ్ళిళ్లు అయిపోయాయి. ప్రస్తుతం సేవ్య ముగ్గురు కుమారులతో కలిసి ఉంటున్నాడు. అయితే కొంత కాలంగా సేవ్య అనారోగ్యంతోపాటు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 12న ఎవరి పనిలోకి వారు వెళ్ళిపోయారు. సేవ్య కూడా పనికి వెళ్లి మధ్యలోనే ఇంటికి తిరిగివచ్చాడు. అనంతరం ఎంఎంఆర్ గార్డెన్ వద్ద మద్యం తాగి, ఆ తరువాత యాసిడ్ యాసిడ్‌ను తాగాడు. ఇది గమనించిన బంధువు విషయాన్ని కుమారులకు తెలిపి హుటాహుటిన ఓల్డ్ బోయినపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని, గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్ళాలని డాక్టర్లు సూచించారు. దీంతో సేవ్యను గాంధీ ఆస్పత్రికి తీసుకువెళ్ళి చికిత్స చేయిస్తున్నారు. కాగా చికిత్స పొందుతున్న సేవ్య శనివారం రాత్రి మృతి చెందినట్లు గాంధీ ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. దీంతో బంధువుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాగ్‌లో ల్యాప్‌టాప్ మాయం

యూసుఫ్‌గూడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నిద్రపోయి లేచే సరికి తన బ్యాగులో ల్యాప్‌టాప్ కనిపించలేదని ఓ యువతి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అనంతపూర్ జిల్లా గూటీ మండలం లచ్చనపల్లి గ్రామానికి చెందిన సుగురు హేమలత అమీర్‌పేటలో కోర్సులు నేర్చుకుంటూ మధురానగర్‌లోని శివసాయి లేడీస్ హాస్టల్‌లో నివాసం ఉంటోంది. ఈ నెల 13వతేదీ రాత్రి 11గంటల సమయంలో తన ల్యాప్‌టాప్‌ను తన బ్యాగులో పెట్టి నిద్రపోయింది. మరుసటి రోజు ఉదయం 9గంటలకు నిద్రలేచి తన బ్యాగు చూడగా తన ల్యాప్‌టాప్ కనిపించలేదు. తన రూమ్‌లో దివ్య, ప్రసన్న, తేజస్వీ అనే వారు ఉంటున్నారని, తన ల్యాప్‌టాప్ రూ.54వేల విలువైందని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఇద్దరు వ్యక్తుల నుంచి గంజాయిని పట్టుకున్న నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు

27కిలోల గంజాయి పట్టివేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై గంజాయి సరుకుతో ఉన్న ఓ ఇద్దరు వ్యక్తుల నుంచి నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు 27కిలోల గంజాయి సరుకును పట్టుకున్నారు. నాంపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫాం నెంబరు 2లో అనకాపల్లికి చెందిన రమణమ్మ(50), గోవింద్(38)లు ఇద్దరూ కలిసి 27కిలోల గంజాయితో ఉన్న బ్యాగులు పక్కన బెట్టుకుని నిలబ్డారు. ఆ సమయంలోనే ఆర్పీఎఫ్ ఏఎస్ఐ సెల్వరాజ్, మహిళా కానిస్టేబుల్ మౌనికలు ఆ ఇద్దరిపై అనుమానం వచ్చి వాళ్ల వద్ద ఉన్న లగేజీలను తనిఖీ చేయగా అందులో 6.50లక్షల విలువ చేసే పొడి గంజాయి సరుకు ఉన్నట్లు తెలుసుకోవడంతో ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించారు. గంజాయిని స్వాధీనం చేసుకున్న నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. 2024లో ఇప్పటి వరకు 52 కిలోల పొడి గంజాయి పట్టుకున్నామని గుర్తుచేశారు.

వరద నీటి కాలువకు మరమ్మతులు చేయాలి

- రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు విద్యార్థులు, బస్తీవాసుల అవస్థలు

రెజిమెంటల్‌బజార్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వర్షం నీరు వెళ్లడానికి నిర్మించిన కాలువపై ఉన్న దిమ్మెలు కూలడటంతో చెత్త చేరి వరదనీరు సాఫీగా వెళ్లలేక స్థంభించిపోతుంది. మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్ మనోహర్ థియేటర్ వెనకాల వర్షం పడితే చెరువును తలపిస్తుంది. సమీపంలో ప్రముఖ పాఠశాలలు, కాలేజీలు ఉండటంతో ఈ మార్గంలో వెళ్లే విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. గతంలో ఉన్న రెయిన్ పిట్స్‌లలో తరుచుగా పూడిక చేరి వరద నీరు వెళ్లడంలేదని నూతనంగా వరద కాలువను నిర్మించారు. దీంతో రోడ్డు మీద ప్రవహించే వరద సమస్య తీరుతుందని ఆశించిన స్థానికులకు నిరాశ మిగిలింది. మూడు రోజుల క్రితం వర్షానికి రోడ్డు జలమయం అయింది. వర్షాకాలంలో ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది. వెంటనే వరద కాలువ మరమ్మతులు చేసేలా ఎమ్మెల్యే, కార్పొరేటర్ చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కూలిన వరద కాలువలో చెత్త



మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి మనోహర్ థియేటర్ వెనక రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

చెత్త తీసే జేసీబీ కారణం

వరద కాలువ పక్కన చెత్త డంపింగ్ చేస్తుండటంతో ప్రతి రోజు చెత్తను లారీలో ఎత్తడానికి జేసీబీ వినియోగిస్తున్నారు. జేసీబీ తగిలి వరద కాలువ కూలిందని స్థానికులు తెలిపారు. గతంలో ఒకసారి కూలితే మళ్లీ నిర్మించారు. నాసిరకంగా నిర్మించడంతో మళ్లీ కూలిందని తెలిపారు. ఇక అప్పటి నుంచి పట్టించుకోవడంలేదని బస్తీవాసులు వాపోయారు.

కంటోన్మెంట్ ప్రజలకు సేవకుడిని

- ఎమ్మెల్యే శ్రీగణేష్



కంటోన్మెంట్ 6వ వార్డులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

బోయినపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ ప్రజలకు సేవకుడిని అని, తనను గెలిపించిన ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. ఆరవ వార్డు పరిధిలోని ఎఎంహెచ్‌ఓ కాలనీ సెక్టార్-సి అధ్యక్షులు శివరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసే అవకాశం నాకు రావడం అదృష్టంగా భావిస్తూ, మీకు నాయకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తానని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. తన దృష్టికి తీసుకువచ్చిన కాంపౌండ్ వాల్, డ్రైనేజీ సమస్య, జిమ్, బోరు సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించి ప్రజలు ఇచ్చిన బాధ్యత నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. వీలైనంత త్వరితగతిన పనులు పూర్తిచేయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పి.ఉమాదేవి, కోశాధికారి ఉదయ్ శంకర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

రెండు రైళ్లలో చైన్ స్నాచింగ్‌లు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో రెండు రైళ్లలో మహిళా ప్రయాణికుల నుంచి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం సికింద్రాబాద్ యాప్రాల్‌కు చెందిన బి.జ్యోతి శనివారం తిరుపతి రైల్వే స్టేషన్‌లో పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. ఎస్-7లో బెర్తు నెంబరు 59లో ప్రయాణం చేస్తుంది. ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో వరంగల్ రైల్వే స్టేషన్‌లో జ్యోతి మొహం కడుక్కునేందుకు వాష్‌బేసిన్ వద్దకు వెళ్లింది.

ఈలోగా 30 ఏళ్లు ఉన్న వ్యక్తి ఆమె మెడలో ఉన్న 30 గ్రాముల బంగారు గొలుసు తెంపుకుని పారిపోయాడు. తోటి ప్రయాణికులకు విషయం తెలుపి, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగిన వెంటనే జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఈ కేసును వరంగల్ జీఆర్పీ పోలీసులకు బదలీ చేశారు

గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో..

కాకినాడకు చెందిన మెడిశెట్టి రామలక్ష్మి కాకినాడలో గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. ఎస్-2 కోచ్‌లో బెర్తు నెంబరు 9లో కిటికీ వద్ద ఉన్న ఆమె ఆదివారం తెల్లవారుఝాము సమయంలో ఆలేర్ రైల్వే స్టేషన్‌లో రైలు ఆగడంతో ఆమె మెడలో ఉన్న 25గ్రాముల మంగళసూత్రాన్ని గుర్తుతెలియని వ్యక్తి తెంపుకుని పారిపోయాడు. వెంటనే రైలులో విధులు నిర్వహిస్తున్న రైల్వే టీటీ, జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసి, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగి జీఆర్పీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయగా, జీఆర్పీ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి . ఈ కేసును ఆలేర్ రైల్వే పోలీసులకు బదిలి చేశారు.

జనరంజకంగా రవీనా, రిషిత భరతనాట్య ప్రదర్శన



నాట్యం చేస్తున్న నర్తకులు

రవీంద్రభారతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): లయబద్ధమైన నాట్యాంశాలకు వైవిధ్యభరితంగా నర్తించిన కవల కళాకారులు పావులూరి రవీనా, రిషిత ఆహుతులను రంజింపజేశారు. చక్కటి అభినయం, ఆకట్టుకునే హావభావాలతో ఇరువురు కళాకారులు జనరంజకంగా ప్రదర్శించారు. ఆదివారం తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో ప్రముఖ నాట్య గురువు పసుమర్తి రామలింగ శాస్త్రి శిష్యురాళ్లయిన రవీనా, రిషిత భరతనాట్యంలో అరంగేట్రం చేశారు. పుష్పాంజలి, గణేష పంచరత్నం, జతిస్వరం, శబ్దం, పాదవర్ణం, కీర్తనం, తిల్లాన, మంగళం తదితర అంశాల్లో నర్తించి భళా అనిపించారు. చక్కటి ఆహార్యం, ఆకట్టుకునే హావభావాలతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారగ్రహీత మంజుల రామస్వామి, సీనియర్ పాత్రికేయులు వల్లీశ్వర్, మానస మూర్తి, అప్పారావు కళాకారులను సత్కరించి అభినందించారు. శాస్త్రీయ కళల్లో చిన్నారులను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. నర్తకుల కుటుంబ సభ్యులు కృష్ణ చైతన్య, అమృత వర్షిణితో పాటు పలువురు సమక్షంలో పసుమర్తి రామలింగశాస్త్రికి గురుసత్కారం చేశారు.

స్క్వాష్ సెమీస్‌లో వేదాంత్, ఆర్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎస్ఎండీసీ తెలంగాణ ఓపెన్ స్క్వాష్ టోర్నమెంట్ ఉత్కంఠభరితంగా జరుగుతోంది. ఆదివారం జరిగిన పురుషుల క్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ వేదాంత్ పటేల్ ఘన విజయం సాధించాడు. అతడితో పాటు ఆర్య, అర్నా ద్వివేది, తనూజ్ రెడ్డి, ధ్రుతి, తమ విభాగాల్లో సెమీస్‌లో ప్రవేశించారు.



సఫిల్‌గూడ చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులతో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకుడు శ్రీకిషన్

బోయినపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ సభ్యులు సమావేశం ఆదివారం డైమండ్ పాయింట్‌లోని కార్యాలయంలో కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ నాయకులు, రాష్ట్ర నాయకుడు శ్రీకిషన్ మాదిగ, రొట్టెల సునీల్ మాదిగల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపైన చర్చించుకున్నారు. అనంతరం నూతన కమిటీ ఏర్పాటుతో పాటు కంటోన్మెంట్ మూడవ వార్డు కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇటికె శ్రీకిషన్ మాదిగ మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీలకు అతీతంగా ఎమ్మార్పీఎస్‌ను ఒక్క తాటిపైకి తీసుకువస్తామని, ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు రాకేష్ మాదిగ గ్రూప్ సభ్యులు మధు మాదిగ, ప్రవీణ్ మాదిగ, నవీన్ మాదిగ, కార్తీక్ మాదిగ, పవన్ మాదిగ, వంశీ మాదిగ, దుర్గేష్ మాదిగ, హరి మాదిగ, బాలరాజ్ మాదిగ పాల్గొన్నారు.

సఫిల్‌గూడ ట్యాంక్‌బండ్ పై కార్పొరేటర్ పర్యటన

- వాకర్స్‌తో సమస్యలపై చర్చ

మల్కాజిగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని మినీట్యాంక్‌బండ్‌పై కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా మార్నింగ్ వాకర్స్‌తో ట్యాంక్‌బండ్‌పై ఉన్న సమస్యలపై చర్చించారు. మురుగునీరు చెరువులో చేరడం వల్ల కలుషితమై దుర్గంధమయంగా చెరువు తయారైందని తెలిపారు. గుర్రపుడెక్క శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరారు. దీంతో పాటు ట్యాంక్‌బండ్‌పై ఉన్న జిమ్ పరికరాలు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించి వాటిని వాకర్స్ సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ విభాగం సిబ్బంది శివ, గురుభూషణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో వర్షం

- జలమయమైన రహదారులు
- మరో రెండు రోజులు వర్ష సూచన



వర్షానికి దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై నిలిచిన వరదనీటిని తొలగిస్తున్న సిబ్బంది

హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ శివారు ప్రాంతాల్లో కురిసిన వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో పలు ప్రాంతాల్లో రోడ్లపై మోకాళ్లలోతు వరదనీరు నిలిచిపోయింది. హయత్‌నగర్‌లో 2.3, డిఫెన్స్‌కాలనీలో 2, అస్మన్‌ఘడ్‌లో 1.5 సెం.మీ వర్షం కురిసింది. దిల్‌సుఖ్‌నగర్, హయత్‌నగర్ ప్రాంతాల్లో కురిసిన వర్షంతో ప్రధాన రహదారులపై వరదనీరు భారీగా నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జీహెచ్ఎంసీ డిజాస్టర్ బృందాలు వరదనీటిని తొలగించాయి. సైదాబాద్, కుర్మగూడ, సరూర్‌నగర్, అంబర్‌పేట, ఉప్పల్, బండ్లగూడ, న్యూనాగోల్, అజంపురా, ఐఎస్‌సదన్, చార్మినార్ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షం కురిసింది. గ్రేటర్‌లో మరో రెండురోజుల పాటు ఉరుములతో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గరిష్ఠంగా 35, కనిష్ఠంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలుంటాయని, ఉపరితల గాలులు గంటకు 6-10 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా వీచే అవకాశముంటుందన్నారు.

భయపెడుతున్న బైక్ రేసింగ్స్

- పలువురిపై కేసు నమోదు.. బైక్‌లు సీజ్
- అయినా.. తీరు మార్చుకోని బైక్ రేసర్లు

రాయదుర్గం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లో ఆకతాయిలు నిర్వహించే బైక్ స్టంట్స్, కట్స్, బైక్‌రైడ్‌లతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శని, ఆదివారాలు వచ్చాయంటే రాయదుర్గం ఐటీ కారిడార్‌లోని టీహబ్ పరిసర ప్రాంత రహదారులపై బైక్‌రైడర్లు గుంపులుగుంపులుగా వచ్చి ప్రజలు తిరుగుతున్న సమయంలోనే బైక్‌స్టంట్స్, రేసింగ్‌లు చేస్తూ హడలెత్తిస్తున్నారు.

15 రోజుల క్రితం రాయదుర్గం పోలీసులు రాత్రి సమయంలో బైక్‌రేసింగ్ చేస్తున్న సుమారు 50 మందిని అదుపులోకి తీసుకున్నారు. బైక్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ ఆకతాయిలు డోంట్‌కేర్ అంటూ మళ్లీ బైక్ రేస్‌లు, స్టంట్‌లు చేస్తూ రోడ్డుపై వెళ్తున్న ప్రజలను హడలెత్తిస్తున్నారు. శనివారం రాత్రి రోడ్డు సందడిగా ఉన్న సమయంలోనే రెచ్చిపోయారు. బైక్‌టైర్లపై పెట్రోల్‌పోసి మంటలు అంటిస్తూ రేసింగ్‌లు నిర్వహించారు. దీంతో ఒక్కసారిగా ప్రజలు భయంతో పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరుగురు బైక్‌రైడర్స్‌ను అదుపులోకి తీసుకున్నారు. బైక్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. అలాగే, బంజారాహిల్స్ తాజ్ హోటల్ వద్ద బైక్‌పై వెళ్తున్న సీనియర్ జర్నలిస్ట్‌ను అతివేగంతో దూసుకెళ్లిన గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో కాలు విరిగింది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బైక్‌రేస్‌లు, స్టంట్స్ చేసే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డుపై బైకులతో యువకులు



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

రాష్ట్రపతి నిలయంలో ఫాదర్స్ డే వేడుకలు

తిరుమలగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో అంతర్జాతీయ పితృ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో పితృ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. హైదరాబాదు రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లాలలోని వయో వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాలు బాల సదన్‌ల నుంచి సుమారు 750మంది పాల్గొన్నారు. పెద్దలు, పిల్లలు పితృ దినోత్సవంలో భాగంగా కుటుంబంలో తండ్రి పాత్రను ఔనత్యాన్ని తెలియజేశారు. అలానే తండ్రి ప్రేమ బాధ్యత గురించి తెలుపుతూ గీతారాపన నృత్య ప్రదర్శన వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులు, బాలసదనంలో ఉంటున్న చిన్నారులను అనుసంధానం చేసేవిధంగా కార్యక్రమం జరిగింది. గాయత్రి స్కూల్ కూచిపూడి డ్యాన్స్, నాగారం కలర్స్ డ్యాన్స్ చిన్నారులు నృత్య ప్రదర్శనతో అలరించారు. సెంటర్ ఫర్ సోషల్ సర్వీస్ పర్సనల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ఆధార్ వెల్ఫేర్ గౌరీ ఆశ్రమం గరల్స్, గవర్నమెంట్ చిల్డ్రన్స్ హోమ్‌తో పాటు బాలసదన్ నుంచి వచ్చిన చిన్నారులు పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి నిలయం అధికారి డాక్టర్ కే.రజనిప్రియ మాట్లాడుతూ ఈ తరం చిన్నారులు, యువత తల్లిదండ్రుల విలువ తెలుసుకొని వృద్ధాప్యంలో వారి పట్ల బాధ్యతగా నడుచుకుంటూ వృద్ధాశ్రమాల సంఖ్య తగ్గించాలని తెలిపారు.



రన్‌ను ప్రారంభిస్తున్న తేజస్వీరావు తదితరులు

రక్తదాన ఆవశ్యకతను తెలిపిన రన్

- అపోలో ఆస్పత్రి, టీసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహణ

హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని అపోలో ఆస్పత్రి, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)తో కలిసి 'వాక్.డొనేట్.రిపీట్' అనే లక్ష్యంతో మూడు కిలోమీటర్ల రన్‌ను జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి వద్ద ఆదివారం నిర్వహించారు. రక్తదానం ప్రాముఖ్యత, అవగాహన పెంపొందించడమే ముఖ్య ఉద్దేశంగా ఈ వాక్‌ను నిర్వహించామని ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. దాదాపు 1500 మంది టీసీఎస్ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానంపై తమకున్న నిబద్ధతను చాటారు. ఈ సందర్భంగా అపోలో ఆస్పత్రులు(తెలంగాణ రీజియన్) సీఈఓ తేజస్వీరావు, డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ (తెలంగాణ రీజియన్) డాక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ రక్తదానం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని తాము చేపట్టిన ఈ వాక్‌కు టీసీఎస్ సహకారం అందించడం హర్షణీయమన్నారు. అనంతరం టీసీఎస్ రీజినల్ హెడ్ చల్ల నాగ్, హెడ్ ఆఫ్ టీసీఎస్ హైదరాబాద్ హెచ్ఆర్ శ్రీకాంత్ సూరంపూడి మాట్లాడుతూ అపోలో సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. రక్తదానం వల్ల ఒక యూనిట్ బ్లడ్ ముగ్గురి జీవితాల్లో వెలుగులను నింపుతుందని డాక్టర్ సుధారంగనాథన్ అన్నారు.



రాష్ట్ర స్థాయి రగ్బీ టోర్నమెంట్‌లో విజేతలుగా నగర జట్టు క్రీడాకారులు

రగ్బీ టోర్నమెంట్‌లో నగర జట్టు విజేతలు

అడ్డగుట్ట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఈనెల 13నుంచి మూడు రోజులపాటు నిర్వహించిన రగ్బీ టోర్నమెంట్‌లో హైద్రాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. హైదరాబాద్ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల, మహిళల విభాగాలలో జరిగిన టోర్నమెంట్ పోటీలో పురుషుల విభాగం హైద్రాబాద్ రగ్బీ జట్టు గెలిపించిందని జిల్లా జట్టు కెప్టెన్ రతీష్ తెలిపారు. గత నాలుగేళ్లుగా ఉస్మానియా యూనివర్శిటీ మైదానం కోచ్ శ్రీకాంత్ నాయక్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకోవడం జరిగిందని రతీష్ తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగిన రగ్బీ పోటీలో హైదరాబాద్ జట్టు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర టోర్నమెంట్‌కు సహాయ సహకారాలు అందించిన ప్రవీణ్‌కుమార్ రగ్బీ ఫుట్‌బాల్ క్లబ్ సభ్యులతోపాటు కోచ్ శ్రీకాంత్‌కు జట్టు సభ్యులు అభినందనలు తెలిపారు.



ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ ప్రతినిధులతో చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డియజ్

ఇంటర్నేషనల్ మెజరర్స్ క్లినిక్ విజయవంతంగా పూర్తి

అల్వాల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ భారతదేశంలో మొదటిసారిగా సెయిలింగ్‌కు సంబంధించి సెయిలర్స్ పోటీల్లో ఎంత దూరం ప్రయాణించాలి అనే అంశంపై ఇంటర్నేషనల్ మెజరర్స్ క్లినిక్‌ను విజయవంతంగా పూర్తిచేసినట్లు ఎంసీఈఎంఈ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ నీరజ్‌వర్షనే తెలిపారు. ఆదివారం ఇంటర్నేషనల్ మెజరర్స్ క్లినిక్ కార్యక్రమంలో ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. త్వరలో హుస్సేన్‌సాగర్ నిర్వహిస్తున్న అంతర్జాతీయ సెమినార్ పోటీలకు సంబంధించి రెండు రోజులుగా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డియాజ్ మార్గదర్శకత్వంలో అంతర్జాతీయ ప్రతినిధి ఇవాన్‌తో సహ 18మంది ఇంటర్నేషనల్ మెజరర్స్ క్లినిక్‌లో పాల్గొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సెయిలర్స్ ఎన్నిరౌండ్లు, పొడవు, అడ్డం ఎంత దూరం సెయిలింగ్ చేయాలనే అంశంపై కొలతను వెల్లడించారు.



ఫీస్ట్ వేడుకల్లో పాల్గొన్న జంపన ప్రతాప్

ఘనంగా మడ్‌ఫోర్టు చర్చి ఫీస్ట్ వేడుకలు

సికింద్రాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ మడ్‌ఫోర్టులోని సెయింట్ ఆంథోనీ చర్చి ఫీస్ట్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, తెలుగు, తమిళ్ మాస్, జెండా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే రెవరెండ్ ఫాదర్ జాన్ భాస్కర్‌రావు వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఫాదర్ భాస్కర్‌రావును ఆయన సత్కరించారు. కార్డినల్ పూల ఆంథోని, రెవరెండ్ ఫాదర్ బాలాజీ బోయల్లా, మెసెంజర్ ఎరువా బాలశౌరి, విక్టర్‌ఇమ్మాన్యుయేల్ రమేష్ పాల్గొన్నారు.